ముంచెత్తిన వరద

- పొంగిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంటపొలాలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు



జగ్గయ్యపేట మండలం ముక్త్యాల రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



పేట గిరిజన బాలుర వసతి గృహాన్ని చుట్టుముట్టిన వరద నీరు



షేర్‌మహ్మద్‌పేట వద్ద పొలాల్లో చేపలు పడుతున్న ప్రజలు



షేర్‌మహ్మద్‌పేటలో నీటమునిగిన వరి పొలాలు



చెరువులా మారిన జగ్గయ్యపేట కోర్టు ఆవరణ

జగ్గయ్యపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా మూడు రోజులుగా కుండపోతగా వర్షం కురవడంతో నియోజకవర్గంలోని వాగులు, వంకలు పొంగి పొర్లాయి. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని పాలేరు, మునేరు ఉధృతి గురువారం ఉదయం కొద్దిసేపు తగ్గినప్పటికీ ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా ఉధృతంగా ప్రవహిస్తోంది. జగ్గయ్యపేట మండలంలో బుధవారం అత్యధికంగా 176.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా జగ్గయ్యపేట పట్టణంలో ఎర్రకాల్వ, వేపలవాగు, చెరువు బజారుల్లోకి వరద నీరు చేరడంతో గృహాలలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పంట పొలాలన్నీ వరద నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి.

రాకపోకలు బంద్..

మండలంలోని పలు గ్రామాలలో వరద నీరు ముంచెత్తింది. షేర్‌మహ్మద్‌పేట, బూదవాడ, అన్నవరం, జయంతిపురం గ్రామాలలో వరద నీరు రావటంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముఖ్యంగా షేర్‌మహ్మద్‌పేటలో చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు జగ్గయ్యపేట రహదారిపై ఐదడుగుల మేర వరద నీరు పారడంతో కొంత మేర రోడ్డు కొట్టుకుపోయింది. చెరువులో చేపలు సైతం వరద ఉధృతికి బయటకు రావడంతో పంట పొలాల్లోకి చేరిన చేపలు పట్టుకునేందుకు జనం ఎగబడ్డారు. జగ్గయ్యపేట నుంచి ముక్త్యాల, అగ్రహారం వెళ్లే రహదారిలో వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

పట్టణాన్ని చుట్టేసిన వరద..

ఎడతెరపి లేని వర్షంతో గురువారం తెల్లవారుజాము వరకు వరద నీరు జగ్గయ్యపేట పట్టణాన్ని చుట్టేసింది. కోదాడ రోడ్డు, కోర్టు ప్రాంగణం బలుసుపాడు రోడ్డులో వరద నీరు చేరింది. ఎర్ర కాల్వ, వేపలవాగు పొంగడంతో ఆర్టీసీ కాలనీ, తొర్రకుంటపాలెం, కాకానినగర్, అయ్యప్పనగర్, చింతలతోపు ప్రాంతాల్లో ఇళ్లలోకి మూడు అడుగుల మేర వరదనీరు చేరింది. పల్లపు ప్రాంతాల్లో భారీగా వరద నీరు చేయడంతో తెల్లవారుజామున రెవెన్యూ, మున్సిపల్ అధికారులు గండ్లుకొట్టి నీటిని బయటకు పంపారు.

క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో



జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ సూచించారు. జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల, రావిరాల, వేదాద్రి, అన్నవరం, బూదవాడ, రెడ్డినాయక్‌తండ, కెఅగ్రహారం, షేర్‌మహ్మద్‌పేటతోపాటు పెనుగంచిప్రోలు మండలంలో గురువారం ఆయన పర్యటించారు. పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలను పరిశీలించారు. మునేరు వరదను, వరద నీటిలో ఉన్న పంట పొలాలను పరిశీలించారు.ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ముఖ్యంగా పాలేటికి తెలంగాణ నుంచి వరద వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంట జగ్గయ్యపేట ఎంపీడీవో నితిన్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి, ఆర్ఐ సూరమ్మ, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, పెనుగంచిప్రోలు తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో సిద్ధారెడ్డి, ఎస్ఐ అర్జున్ ఉన్నారు.

డివిజన్‌లో 917.2 మి.మీ వర్షపాతం

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లో బుధవారం 917.2 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఉపగణాంకాధికారి ప్రసాద్ గురువారం తెలిపారు. జగ్గయ్యపేట మండలంలో అత్యధికంగా 176.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వివరించారు. నందిగామ నియోజకవర్గంలో 472.8 మి.మీ వర్షం కురవగా జగ్గయ్యపేట నియోజకవర్గంలో 443.6 మి.మీల వర్షపాతం నమోదైంది. నందిగామ మండలంలో 165.2 మి.మీ, కంచికచర్ల మండలంలో 94.8 మి.మీ, చందర్లపాడు మండలంలో 90.0 మి.మీ, వీరులపాడు మండలంలో 122.8 మి.మీ, పెనుగంచిప్రోలు మండలంలో 165.0 మీ.మీ, వత్సవాయి మండలంలో 102 మి.మీ వర్షం కురిసినట్లు ప్రసాద్ వివరించారు.

పాలకుల నిర్లక్ష్యమే కారణం : తన్నీరు



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని వేపలవాగు పరిసర ప్రాంతాల్లో సుమారు 500 గృహాలు నీట మునగడానికి పాలకుల నిర్లక్ష్యమే కారణమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టణంలోని 1, 2, 5, 6, 7వార్డుల్లో వేపలవాగు, కాకానినగర్, డాంగేనగర్, టెలిఫోన్‌కాలనీ, దుర్గాపురం తదితర ముంపు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి అక్కడి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ చెరువు నీరు ఇళ్లలోకి చేరడంతో విలువైన సామగ్రి తడిచిపోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. గతేడాది కూడా ఇదే పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రభుత్వం వెంటనే బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. తన్నీరు వెంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, నాయకులు సత్య శ్రీనివాసరావు, పెంటి శ్రీనివాసరావు, నంబూరి రవి, దర్శి వెంకటేశ్వర్లు, పింగళి నర్సింహరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పిడమర్తి ప్రభు, మెట్టు ఏడుకొండలు,గొట్టిపాళ్ల సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ మన్నె అప్పారావు, సయ్యద్ బుజ్జి ఆలీ, దేవరశెట్టి వీరాంజనేయులు ఉన్నారు.

చెరువులను తలపిస్తున్న పంట పొలాలు



అనిగండ్లపాడులో నీట మునిగిన వరి పొలాలు



గుమ్మడిదుర్రు వద్ద వరదకు దెబ్బతిన్న రోడ్డు

పెనుగంచిప్రోలు: అల్పపీడన ప్రభావంతో బుధవారం రాత్రి కుండపోతగా కురిసిన భారీ వర్షానికి వాగులు పొంగడంతో మండల కేంద్రం పెనుగంచిప్రోలు నుంచి పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరద ప్రవాహానికి శనగపాడు వద్ద వాగుపై కల్వర్టు చప్టాకొట్టుకు పోవడంతో పెనుగంచిప్రోలు నుంచి నందిగామకు శనగపాడు మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగు అవతల ఉన్నవారు తెల్లవార్లు అక్కడే ఉండి ఉదయం స్థానికుల సాయంతో గ్రామానికి చేరుకున్నారు. అనిగండ్లపాడు–గుమ్మడిదుర్రు మధ్య వరద నీటికి ఇటీవల నిర్మించిన తారు రోడ్డు కొంతమేర కొట్టుకుపోగా, పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. గత వరదలకు కల్వర్టు దెబ్బతినగా తాత్కాలికంగా తూములు ఏర్పాటు చేసి మట్టి పోసి రాకపోకలు సాగిస్తున్నారు. అక్కడ కూడా వరదకు రోడ్డు కుంగిపోయి తూములు బయటకు వచ్చాయి. అనిగండ్లపాడు, ముచ్చింతాల వద్ద కూచివాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు గురువారం మధ్యాహ్నం వరకు నిలిచిపోయాయి. పెనుగంచిప్రోలు చెరువు అలుగుల వద్ద ఉదయం 11 గంటల వరకు రాకపోకలకు అంతరాయం కలిగింది. లింగగూడెం వద్ద గండివాగు, ముండ్లపాడు వద్ద వాగులు పొంగడంతో రాకపోకలు నిలచి పోయాయి. వాగుల పక్కన వందల ఎకరాల్లో పొలాలు ఇప్పటికీ వరద నీటిలో మునిగి ఉండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంపునకు గురైన పంటపొలాలు

వత్సవాయి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వత్సవాయి మండలంలో వందలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. చిల్లకల్లు వైరా రోడ్డు, పెనుగంచిప్రోలు రైల్వేట్రాక్, గోపినేనిపాలెం వద్ద వర్షపునీరు రోడ్డుపైన పారుతుండటంతో వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందిపడ్డారు. చిట్టేల వద్ద వరి పొలాలు ముంపునకు గురయ్యాయి.మండలంలో బుధవారం 102 మిల్లీమీటర్ల మేర వర్షం కురవగా, గురువారం కూడా వర్షం పడుతూనే ఉంది. ఎగువ ప్రాంతాలైన వరంగల్, ఖమ్మం జిల్లాలలో కూడా వర్షాలు పడుతుండటంతో మునేటికి భారీస్థాయిలో వరదనీరు చేరింది. 20వేల క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వరదనీరు కాజ్‌వేకు ఆనుకుని ప్రవహిస్తోంది. వరదనీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని కాజ్‌వేకు ఇరుపక్కలా రెవెన్యూ పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు తెలిపారు.

కాజ్‌వే వద్ద 850 క్యూసెక్కుల వరద



పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు కాజ్‌వే వద్ద 850 క్యూసెక్కుల వరద నీరు మునేరులో ప్రవహిస్తోందని సెంట్రల్ వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ) ప్రతినిధులు తెలిపారు. సీడబ్ల్యూసీ అధికారులు గురువారం సాయంత్రం మునేరులో నీటి ఉధృతిని పరిశీలించారు. యంత్ర సాయంతో వరదనీటి ప్రవాహాన్ని లెక్కించారు. బుధవారంతో పోల్చితే వరద తగ్గుముఖం పట్టిందని వారు తెలిపారు.

రైతులకు తీరని నష్టం



చందాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగు



అనాసాగరం రోడ్డుపై నుంచి పారుతున్న కూచివాగు



కంచికచర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచిన వర్షపు నీరు



నందిగామ ఫైర్ స్టేషన్‌లోకి చేరిన వర్షపు నీరు

నందిగామ రూరల్: మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నందిగామ మండలంలోని ఆయా గ్రామాల్లోని పంట పొలాలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా భారీ వర్షంతోపాటు ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా మండలంలోని మున్నేరు, వైరాకట్టలేరులతోపాటు వాగులు, వంకలు, చెరువుల నుంచి నీరు పొంగి పొర్లటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముఖ్యంగా అనాసాగరం నుంచి పెనుగంచిప్రోలు మండలం శనగపాడు వెళ్లే రోడ్డులోని కూచివాగు, చందాపురం గ్రామ సమీపంలోని నల్లవాగు పొంగి పొర్లుతుండటంతో ఆయా గ్రామాలకు రాకపోకలను అధికారులు నిలిపివేశారు. గురువారం సాయంత్రం వరకు కూడా కాజ్‌వే పైనుంచి వరద ప్రవహించింది. తొర్రగుడిపాడు, కొణతమాత్మకూరు, దాములూరు, కూడలితోపాటు మండలంలోని ఆయా గ్రామాలలోని పంట పొలాలు పూర్తిగా నీటితో నిండి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో మాగాణి సాగుకు సిద్ధం చేసిన నారుమడులు, వరి మాగాణి పంట పొలాలు వరద ధాటికి కొట్టుకుపోయాయి. సోమవరం నుంచి రుద్రవరం వెళ్లే రహదారికి గండి పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పత్తి, మాగాణి, వరి నారుమడులు నీటితో నిండిపోవడంతో నీటిని బయటికి పంపించేందుకు అగచాట్లు పడుతున్నారు. గల్లు గ్రామంలోని దంతాల వీరభద్రరావుకు చెందిన కోళ్లఫారం షెడ్డు కుప్పకూలి 70కిపైగా కోళ్లు మృతిచెందాయి.

వరద ముంపులో ఫైర్ ఆఫీస్..

పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం వరద ముంపునకు గురైంది. కార్యాలయంలోకి మూడు అడుగులకు పైగా వరద నీరు చేరింది. అశోక్‌నగర్ పెట్రోల్ బంకు వద్ద డ్రైనేజీ పొంగడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు.

ఆర్టీసీ బస్టాండ్ జలమయం

కంచికచర్ల: అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.కంచికచర్ల మండలంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పత్తి, పెసర చేలల్లో భారీగా వర్షపునీరు నిలిచింది. దీంతో ఆ నీటిని బయటికి పంపించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కంచికచర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో మోకాలి లోతు మేర వర్షపునీరు నిలబడటంతో బస్సులు బస్టాండ్ లోపలికి వెళ్లలేని పరిస్థితి. దీంతో రోడ్డుపైనే ప్రయాణికులను ఎక్కించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాలకు మండలంలోని చెవిటికల్లు లక్ష్మయ్య వాగు, కంచికచర్లలోని నల్లవాగులు పొంగడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. గండేపల్లి కీసర మధ్యన ఉన్న కొత్తవాగు ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటలపాటు రాకపోకలకు అవరోధం ఏర్పడింది.

ఉధృతంగా ప్రహిస్తున్న మునేరు

కంచికచర్ల: ఎగువ ప్రాంతాలతోపాటు ఈ ప్రాంతంలో కురిసిన వర్షాలకు కీసర మునేరుకు భారీగా వరదనీరు చేరింది. దీంతో మునేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మునేరుకు 390 క్యూసెక్కుల నీరు చేరిందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.

వాగు ఉధృతి పరిశీలన

నందిగామ టౌన్: చందాపురం గ్రామసమీపంలోని నల్లవాగు వరద ఉధృతిని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తొర్లికొండ సీతారామయ్య, నాయకులు గురువారం పరిశీలించారు. ఆయన వెంట నాయకులు మునగంటి కామేశ్వరరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, గంటా వెంకట్రావ్, షేక్ సైదా ఉన్నారు.

హామీల అమలుకు డిమాండ్



నందిగామ 15వ వార్డులో క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నందిగామటౌన్: చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న ఆశలు ఏడాదిలోనే అడియాసలయ్యాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్ విమర్శించారు. పట్టణంలోని 15, 17, 18 వార్డులలో గురువారం రాత్రి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు హామీలను అమలుచేయకుండా ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఓర్సు లక్ష్మి పాకాలపాటి కృష్ణ, నాయకులు ఓర్సు జ్వాలా, షేక్ యాకుబ్‌అలీ, ఓర్సు కొండ, వల్లెపు రవి, పోతురాజు, షేక్ మున్నా, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

పర్యటన జగ్గయ్యపేటఅర్బన్: మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు జగ్గయ్యపేటలో వరదనీటి ముంపుకు గురైన . వైవై కాలనీ, ఆర్టీసీ కాలనీ, దుర్గాపురం, చెరువు అలుగు ప్రాంతాల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం పర్యటించారు. రైల్వే బ్రిడ్జి వద్ద కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఫిర్యాదు హాస్యాస్పదం

నందిగామటౌన్: సీఎం చంద్రబాబును ఏకవచనంతో మాట్లాడారంటూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నెకంటి జీవరత్నం ఎద్దేవా చేశారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, పల్లి జయరాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

వీరులపాడు: పెద్దాపురం సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సమాచారహక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సొసైటీ కార్యదర్శి నల్ల కోటేశ్వరరావు, సొసైటీ మాజీ చైర్మన్ కోటేరు సత్యనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వరద నీటిలోకి కెమికల్స్ విడుదల



జగ్గయ్యపేట: పట్టణ సమీపంలోని ఆటోనగర్ పారిశ్రామికవాడలో గురువారం సాయంత్రం కెమికల్ కర్మాగారం నుంచి కెమికల్ వాటర్‌ను బయటకు విడుదల చేయడం ఆ ప్రాంత ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కర్మాగారం సమీపంలోని వరద నీరు చేరింది. దీంతో యాజమాన్యం ఫ్యాక్టరీ వ్యర్థాల కెమికల్ వాటర్‌ను వరద నీటితో కలిపి పైపుల ద్వారా బయటకు విడుదల చేసింది. దీంతో రసాయనాల వాసనకు ప్రజలు ఇబ్బందిపడ్డారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాధితులను ఆదుకోవాలి

జగ్గయ్యపేటఅర్బన్: వర్షాల కారణంగా నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సీపీఎం పార్టీ పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి డిమాండ్ చేశారు. వర్షాలకు దెబ్బతిన్న పొలాలు, ఇళ్లను గురువారం సీపీఎం నాయకులు పరిశీలించారు. నాగమణి మాట్లాడుతూ వేపలవాగుపై బ్రిడ్జిని నిర్మించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు కాకనబోయిన లింగారావు, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైరా–కట్టలేరుకు పోటెత్తిన వరద

వీరులపాడు: కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ముఖ్యంగా పల్లంపల్లి గ్రామం వద్దనున్న వైరాకట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దార్ రవికుమార్, ఎస్ఐ అనిల్ వైరాకట్టలేరు ప్రవాహ ఉధృతిని పరిశీలించి నందిగామ–వీరులపాడు మండలాల మధ్య రాకపోకలను నిలుపుదల చేశారు. సిబ్బందిని కాపలా ఉంచారు. వర్షాలకు పెసర, మినుము పొలాల్లో భారీగా వరద నీరు చేరింది.

దెబ్బతిన్న పొలాలు పరిశీలన

జగ్గయ్యపేట: మండలంలోని షేర్‌మహ్మద్‌పేట, తిరుమలగిరి గ్రామాలలో వరద ముంపునకు గురైన పంట పొలాలను వ్యవసాయ శాఖ ఏడీ భవానీ గురువారం పరిశీలించారు. మున్నేరు ఆయకట్టు ప్రాంతంలో వరి 815 ఎకరాలు, పెసర 60 ఎకరాలు, పత్తి 665 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తెలిపారు. ఏడీ వెంట ఏవో వరలక్ష్మి రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు